క్లుప్తంగా

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన బన్నీ



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో బన్నీ

కనిగిరి రూరల్: మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు.

జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మకు శుభాకాంక్షలు



జెడ్పీ చైర్‌పర్సన్‌కు బొకే అందజేస్తున్న జెడ్పీటీసీలు

కనిగిరి రూరల్: జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు జెడ్పీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, కనిగిరి జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మూడేళ్ల పదవీ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని నాల్గో వసంతం లోకి అడుగిడుతున్న సందర్భంగా ఒంగోలు జెడ్పీ కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్‌ను కలిసి పుష్ప గుచ్ఛం అందచేసి కేక్ కట్ చేశారు. నాయకులు పోలక సిద్ధారెడ్డి, సంగటి మహేంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, శశి పాల్గొన్నారు.

గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలి



హాజీపురంలో మాట్లాడుతున్న ఎస్సై మాధవరావు

హనుమంతునిపాడు: దొంగతనాలు, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కె.మాధవరావు అన్నారు. మండలంలోని హాజీపురం, వాలిచర్ల, దొడ్డిచింతల గ్రామాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రాత్రిళ్లు దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లు, రాగి వైర్లు చోరీ చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు.

నియోజకవర్గ పోటీల్లోనూ రాణించాలి



ప్రతిభచాటిన విద్యార్థులతో ఎంఈఓ, హెచ్‌ఎం

సీఎస్‌పురం(పామూరు): మండలస్థాయి స్కూల్ గేమ్స్‌లో సత్తా చాటిన క్రీడాకారులు నియోజక వర్గ స్థాయిలో జరిగే క్రీడల్లోనూ సత్తా చాటాలని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని పెదరాజుపాలెంలో ఇటీవల జరిగిన 68వ మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులను బుధవారం ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు అభినందించారు. హెచ్‌ఎంలు, సీఎస్‌పురం షేక్.ఖాదరున్నీసాబేగం, రాజుపాలెం అరియారం సురేష్, నాగులవరం మందాకుమారి, పీడీ టి.వంశీకృష్ణ, షేక్.ఖాజామస్తాన్, నాయబ్‌రసూల్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే తగిన గుర్తింపు



సునీతాదేవిని సన్మానిస్తున్న హెచ్‌ఎం, నాయకులు

సీఎస్‌పురం(పామూరు): ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందని అంకితభావంతో పనిచేస్తేనే వృత్తిలో తగిన గుర్తింపు వస్తుందని వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్.ఖాదర్‌బీబుజ్జి, నాయకులు పాలపర్తి నారాయణరావు, ఎ.బాలకేశవరెడ్డి అన్నారు. మండలంలోని కోవిలంపాడు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన సీహెచ్ సునీతాదేవిని బుధవారం పాఠశాలలో హెచ్‌ఎం బి.శివప్రసాదాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఘనంగా సన్మానించారు. పీఎంసీ చైర్మన్ బాలకాశయ్య,నాగూర్ విద్యార్థులతల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇసుక కష్టాలు.. ఇంతింత కాదయా..!

'ఇసుక ఉచితంగా ఇచ్చేస్తున్నాం. అందరూ తీసుకెళ్లి పనులు చేసుకోండి' అంటూ చంద్రబాబు ప్రగల్భాలు పలకడమే గానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా ఉంది. కనీసం ట్రక్కు ఇసుక దొరికే పరిస్థితి లేదు. దీంతో భవన నిర్మాణాలు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. ఫలితంగా భవన నిర్మాణ కూలీలకు పని కరువై పూట గడవటం కష్టంగా మారి దయనీయ స్థితిలో బతుకీడిస్తున్నారు. భవన నిర్మాణ పనులు లేక అనేక మంది ఇతరత్రా పనులకు పోతుండగా.. మరికొందరు వేరే పనులు చేత గాక పడుతున్న అవస్థలు వర్ణనాతీతం.

- ఇసుక లేక నిలిచిన భవన నిర్మాణాలు
- పనులు లేక అడ్డాపైనే కూలీల పడిగాపులు
- పూట గడవని దుస్థితిలో భవన నిర్మాణ కార్మికులు
- నియోజకవర్గంలో సుమారు 10 వేలకు పైగా భవన నిర్మాణ కార్మికులు
- 5 వేలకు పైగా బేల్దారీ కూలీలు..
- ఇసుక కొరతతో ఆగిన భవన నిర్మాణాలు



అడ్డాలపై భవన నిర్మాణ కార్మికుల పడిగాపులు

కనిగిరి రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజుల్లో ఇసుక కష్టాలు వర్ణణాతీతంగా మారింది. ఎక్కడా ట్రక్కు ఇసుక కూడా అందుబాటులో లేని పరిస్థితి. అధికార పార్టీ నేతలకు అవసరమైతే లోకల్ ఇసుక తవ్వకాలతో సరి చేసుకుంటుండగా.. సామాన్యుడికి.. కార్మికులకు ఇసుక అందని పరిస్థితి. ఫలితంగా ఎందరివో భవన నిర్మాణాలు నిలిచిపోయి.. అనేక మంది కార్మికులు పనుల్లేక పస్తులు ఉంటున్నారు. ఇసుక కొరతతో నిర్మాణాలు నిలిచాయి. భవన నిర్మాణ రంగంపై ఆధార పడిన అనేక మంది కార్మికులు అల్లాడుతున్నారు, కనిగిరి నియోజకవర్గంలో సుమారు 10 వేలకు పైగా భవన నిర్మాణ కార్మికులుండగా.. ఒక్క కనిగిరి మండలంలోనే 1,500ల మంది బేల్దారీ పనులు చేసే కార్మికులున్నారు. కనిగిరి, పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల, పీసీపల్లి, హెచ్‌ఎంపాడు మండలాలకు నెల్లూరు నుంచి ఇసుక తరలించాల్సి ఉంటుంది. టన్ను ఇసుక రూ.2 వేల వరకు పడుతుంది. అది కూడా దొరకని పరిస్థితి నెలకొంది. కొన్ని మండలాల్లో వాగుల్లోనుంచి అక్రమంగా కట్టుబడి ఇసుకను తెస్తున్నా.. అది కూడా టీడీపీ నేతల అనుయాయులు మాత్రమే తొలుకునే పరిస్థితి. వేరే వారు తొలితే ఆ ట్రాక్టర్లను పోలీసులకు ఫిర్యాదు చేసి పట్టిస్తున్నారు. దీంతో కట్టుబడి ఇసుక సైతం వారే చెప్పిన రేటుకే బతిమాలాడుకుని టన్ను రూ.1300 వరకు చెల్లించి తీసుకోవాల్సిన దుస్థితి. దీంతో అధిక ధరలు పెట్టి ఇసుక కొనుగోలు చేయలేక అనేక మంది ఇంటి యజమానులు భవ నిర్మాణాలను నిలిపి వేశారు.

ఉచిత ఇసుక అదో మసక...

అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుక ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం.. ఇటు ప్రజలను, అటు భవన నిర్మాణ కార్మికులను నిలువునా మోసం చేసిందని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇసుక సరఫరా లేక.. పనులు సాగకా అనేక మంది రెక్కాడితే కాని డొక్కాడని బేల్దార్ కూలీలు, తాపీ కూలీలు అల్లాడుతున్నారు. పండుగ సీజన్‌లలో గృహ ప్రవేశాలు జరగాల్సిన అనేక ఇళ్లు ముందుకు సాగలేదు.

ప్రభుత్వ వైఖరితో కార్మికుల వలస:



కూటమి ప్రభుత్వ విధానంతో అనేక మంది భవన నిర్మాణ కార్మికులు పనులేక అల్లాడుతున్నారు. చాలా మంది భవ నిర్మాణ కార్మికులు వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. కొంత మంది ఊరు వదిలి వెళ్లలేక తాపీ పట్టిన చేత్తో ఎంగిలి ప్లేట్లు కడుగుతున్నారు. ఉచిత ఇసుక అంటూ అసలే లేకుండా చేసి ప్రజలను మోసం చేస్తోంది ప్రభుత్వం.

జి.బాలిరెడ్డి, ఏఐటీయూసి జిల్లా నాయకుడు

ఇసుక లేక పనులు జరగడం లేదు:



పండుగ సీజన్‌లో సుమారు పది ఇళ్ల వరకు పనులు పూర్తి చేసి ఇవ్వాలి. ఇసుక సక్రమంగా అందక పోవడంతో భవన నిర్మాణాలు నిలిచాయి. నా దగ్గర సుమారు 50 మంది బేల్దార్లు, కూలీలు ఉన్నారు. ప్రతి రోజు పనులు కల్పించలేకపోతున్నా. ఇసుక కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం తక్షణం ఇసుక సరఫరా చేసి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి.

సీదా మాలకొండయ్య, బేల్దారీ మేస్త్రీ, పాతూరు

సాగులో మెళకువలు పాటించాలి



వగ్గంపల్లెలో విత్తన మినుములు పంపిణీచేస్తున్న ఏఓ, హెచ్‌ఓ, సర్పంచ్



అగ్రహారంలో వరిపైరు సాగులో మెళకువలు వివరిస్తున్న ఏడీఏ

పామూరు: రైతులు పంటల సాగులో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలతో మెళకువలు గుర్తెరగాలని వ్యవసాయాధికారి కంచం రాధ, హెచ్‌ఓ కె.కుసుమ అన్నారు. మండలంలోని వగ్గంపల్లె, రావిగుంటపల్లె రైతుసేవా కేంద్రాల పరిధిలో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా కంది, వరి పైరులను పరిశీలించి విబిఎన్-8 వ రకం మినుము విత్తనాలు అందజేశారు. సర్పంచ్ దేవనబోయిన సుబ్బయ్య, వీఏఏ పి.శ్రీనాథ్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): రైతులు వాణిజ్య పంటల వైపు దృష్టి సారించాలని వ్యవసాయశాఖ ఏడీఏ ఎ.వెంకటరమణ అన్నారు. మండలంలోని అగ్రహారం, పెదగోగులపల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రహారంలో వరిసాగును, పెదగోగులపల్లెలో కందిసాగును పరిశీలించి రైతులకు సాగులో మెళకువలు, వాటిని ఆశించే తెగుళ్ల గురించి తెలిపి నివారణ చర్యలు వివరించారు. వెటర్నరీ ఏడీ డాక్టర్ మునీర్ పశువుల పెంపకంలో మెళకువలు, సీజనల్‌వ్యాధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. చావా చంద్రశేఖర్, వల్లంశెట్టి వెంకటనారాయణ, చీర్లదిన్నె రాధ, ఆశం బాలిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కొండపి (సింగరాయకొండ): రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని జేడీఏ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చిన్నకండ్లగుంటలో ప్రకృతి వ్యవసాయంపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి అవసరమయ్యే తొమ్మిది సూత్రాలను చక్రం ద్వారా రైతులకు వివరించారు. పంటలకు అవసరమయ్యే కషాయం గురించి వివరించారు. వ్యవసాయాధికారి విజయకుమార్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎన్‌ఎఫ్‌ఏ ఝాన్సీ, ఎం.టి ఎస్తేరు, పెరిదేపి యూనిట్ ఇన్‌చార్జి రంజిత్, ఇలవర యూనిట్ మందాకిని, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

టంగుటూరు: శనగలో విత్తనశుద్ధితో చీడపీడలు దూరమని వ్యవసాయాధికారి స్వర్ణలత అన్నారు. మండలంలోని జమ్ములపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ వైద్యులు ధనలక్ష్మి, సర్పంచ్ కొమ్మినేని రవణమ్మ, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

మర్రిపూడి: మండలంలోని గుండ్లసముద్రంలో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ ఖరీఫ్‌సీజన్‌లో కంది, మిరప పంటలకు ఆశించే చీడ పీడల నివారణ గురించి వివరించారు. ధనలక్ష్మీ, రఘువీర్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

సింగరాయకొండ: గంజాయి, పేకాట, కోడిపందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్సై బి.మహేంద్ర సూచించారు. మండలంలోని పాకల పట్టపుపాలెం గ్రామాల్లో బుధవారంపర్యటించారు. ఎస్సై మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలతో జీవితాలు అంధకారమవుతాయని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ లో బహిరంగప్రదేశాలలో మద్యం సేవించే వారికి జరిమానా విధించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

కనిగిరి రూరల్: పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం అవుతాయని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కమిషనర్ డానియల్ జోసఫ్ అన్నారు. మున్సిపల్ శాఖ, మెప్మా, గుడ్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పట్టణంలోని స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్, కమిషనర్ జోసఫ్‌లు మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, మెప్మా టీఎంసీ రఘు, మంద్రు రమేష్, నవకుమార్, ఏఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సాగర్‌నీరు సాధనకు ఐక్య ఉద్యమం

కొండపి(సింగరాయకొండ): మూసికి సాగర్ నీరు సాధించే వరకు సమైక్య ఉద్యమం సాగించాలని రైతు, రైతు కూలీ, వ్యవసాయ కార్మిక సంఘాల సదస్సు తీర్మానించింది. కొండపిలో బుధవారం సదస్సు నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు కేజీ మస్తాన్, రైతు సంఘ నాయకుడు ఆర్ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సభలో రైతు సంఘ జిల్లా కార్యదర్శులు పమిడి వెంకటరావు, కె.వీరారెడ్డి మాట్లాడుతూ మూసికి సాగర్ నీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి సిరిగిరి లలిత కుమారి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రికి వినతిపత్రం అందజేశారు.

ప్రజలు భాగ్యస్వాములు కావాలి



అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి, కలెక్టర్

కొండపి (సింగరాయకొండ): స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో ప్రజలు భాగ్యస్వామ్యం కావాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. కొండపిలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామితో కలిసి మాట్లాడారు. అనంతరం కొండపిలో రూ.50 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ నుంచి గ్రామసభలు నిర్వహించి అర్హులకు పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. మంత్రి స్వామి మాట్లాడుతూ జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద సిమెంట్ రోడ్లు, సైడు కాలువల నిర్మాణానికి రూ.143 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఒంగోలు ఆర్డీఓ సుబ్బారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి, తహసీల్దార్ మురళి పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ బృందం రికార్డుల పరిశీలన

పీసీపల్లి: మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులను పరిశీలించేందుకు సోషల్ ఆడిట్ బృందం మండలానికి వచ్చారు. ఈసందర్భంగా బుధవారం మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్నారు.

మాగుంట పార్వతమ్మ మృతికి సంతాపం



ఎమ్మెస్సార్ కళాశాలలో సంతాప సభ

కనిగిరి రూరల్: మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ మృతికి పలువురు సంతాపం తెలిపారు. స్థానిక ఎమ్మెస్సార్ బాలికల జూనియర్ కళాశాలలో దివంగత పార్వతమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.వెంకటరెడ్డి, హెచ్‌ఎం కలువ విజయలక్ష్మి,ఉపాధ్యాయులు,అధ్యాపకులు,విద్యార్థినులు పాల్గొన్నారు.

దాతల సాయం అభినందనీయం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

హనుమంతునిపాడు: దాతల సాయంతో తాగు నీటి ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. గురువారం వాలిచర్లలో దాత మల్లెల వెంకటరెడ్డి వారి తండ్రి మల్లెల వెంకటసుబ్బారెడ్డి జ్ఞాపకార్థం రూ.8 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొగన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు



నియోజకవర్గ స్థాయి పోటీలను ప్రారంభిస్తున్న ఎంఇఓ శ్రీనివాసరావు



ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు

సింగరాయకొండ: క్రీడలతో విద్యార్థులలో శారీరక దృఢత్వంతో పాటు పోటీతత్వం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఎంఈఓ కత్తి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌లో ఆటలు ఆడటం కన్నా క్రీడలు ఆడితే మానసిక ఉల్లాసం పెంపొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడల్లో ఆరు మండలాలకు చెందిన 300 మంది పాల్గొని ప్రతిభ చాటుకున్నారు. పాఠశాలల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం



మోపాడులో పౌష్టికాహార ఆవశ్యకతపై వివరిస్తున్న సూపర్‌వైజర్, హెచ్‌ఎం

పామూరు: పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం సాధ్యమని, ఇందుకోసం గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని మోపాడు ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం నక్కల నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అన్నారు. మండలంలోని మోపాడు ఎంపీయూపీ పాఠశాలలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కె.ప్రశాంతి, బీవీ లలితకుమారి, టి.జ్యోతి, వసంతలక్ష్మి, ఓబులమ్మ, ఏఎన్‌ఎం నిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): అంగన్‌వాడీలు పిల్లలకు సంరక్షణా కేంద్రాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.దేవకృపావరం అన్నారు. మండలంలోని పెదరాజుపాలెంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈసందసర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక పౌష్టికాహారం ఉన్న ముడిధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు తినాలని సూచించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీఎస్ హెచ్‌ఎం లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్య సాధన దిశగా విద్యనభ్యసించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సీఐ, ఎంఈఓ, డాక్టర్

పామూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు ఇష్టంతో కష్టపడి చదవాలని సీఐ భీమానాయక్, ఎంఈఓ జి.కరుణకుమారి, డాక్టర్ గద్దే ఏడుకొండలు అన్నారు. స్థానిక ఎస్‌వీ జూనియర్ కళాశాల, ఈటీఎస్ అండ్ ఎల్ డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సర విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలు బుధవారం స్థానిక అనిల్ గార్డెన్స్‌లో కరస్పాండెంట్, డైరెక్టర్ యేలూరి నరేస్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ 20 ఏళ్ల విద్యార్థి జీవితంలో కష్టపడి చదివితే మిగిలిన భావిజీవితం సుఖమయమవుతుందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, కంప్యూటర్ పరిజ్ఞానం, సాంస్కృతిక అంశంతో పాటు సమాజసేవకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మత్తు పదార్థాలకు, సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించగా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈటీఎస్ అండ్ ఎల్ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఏవీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం వెంకటేశ్వర్లు, కేసీహెచ్.ప్రసాద్, వి.మాధవ, నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

1153 బేళ్లు కొనుగోలు



వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు

కొండపి(సింగరాయకొండ): స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో 1153 బేళ్ల కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్కుమార్ తెలిపారు. కామేపల్లి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు 1259 బేళ్లను వేలానికి తీసుకురాగా అందులో 1153 బేళ్లను కొనుగోలు చేశారు. వ్యాపారులు వివిధ కారణాలతో 106 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.169, సరాసరి రూ.258.70గా నమోదైంది. వేలంలో 13 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో బుధవారం జరిగిన వేలంలో 1020 పొగాకు బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. దావగూడూరు, చింతలపాలెం, తూర్పునాయుడుపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1195 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 1020 కొనుగోలు చేసి 190 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.358, కనిష్ఠ ధర రూ.190, సరాసరి రూ.308.35గా నమోదైంది. వేలంలో 45 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

చెకుముకి టాలెంట్ టెస్టుకు 102 మంది హాజరు



టాలెంట్ టెస్ట్ పత్రాలను విడుదల చేస్తున్న ఎంఈఓ



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

హనుమంతునిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించారు. టాలెంట్ టెస్టుకు 102 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారావు, జేవీవీ మండల కార్యదర్శి ఎం బ్రహ్మయ్య, సభ్యులు నాగయ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: చెకుముకి టాలెంట్ టెస్టులు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందిస్తాయని ఎంఈఓ యువీ నారాయణరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ సంబరాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ యువీ నారాయణరెడ్డి మాట్లాడుతూ జేవీవీ ఆధ్వర్యంలో చేపడుతున్న సైన్స్ కార్యక్రమాలను కొనియడారు. పరీక్షలకు 1500 విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ మూలే బ్రహ్మారెడ్డి, హెచ్‌ఎం మాధవ శర్మ, నరసింహారావు పాల్గొన్నారు.

సంఘమేశ్వరం పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం



అయ్యపరాజుపాలెంలో మాట్లాడుతున్న మంత్రి స్వామి

మర్రిపూడి: సంఘమేశ్వరం ప్రాజెక్ట్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని అయ్యపురాజుపాలెం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో రూ. 10 కోట్లతో హాస్టళ్లను అభివృద్ధి చేస్తామన్నారు. దీపావళి నుంచి మహిళలకు ఉచిత సిలిండర్లు పంపిణీ చేస్తామని తెలిపారు. 2014-19లో ఇళ్లు నిర్మించుకొని బిల్లులు రాని లబ్ధిదారులకు రూ.45 కోట్ల వరకు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో రూ.40లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్‌కు శంకుస్థాపన చేశారు. ఆయన వెంట చేరెడ్డి నర్సారెడ్డి, వై శ్రీనివాసులు, టి.నర్సింహారావు, ఆర్ వీరనారాయణ, గొంటు హనుమారెడ్డి, దాసరి వెంకటేశ్వర్లు, కిరణ్, బి.రాంబాబు, మాధవలు పాల్గొన్నారు.

17 మద్యం బాటిళ్లు స్వాధీనం

టంగుటూరు: అక్రమంగా తరలిస్తున్న 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన టంగుటూరు జాతీయ రహదారిపై జరిగింది. జరుగుమల్లి మండలం వావిలేటిపాడు గ్రామానికి చెందిన నిడమనూరు సంజీవరావు, పాలేటి కోటేశ్వరరావులు మద్యం బాటిళ్లు తరలిస్తుండగా పట్టుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

మాకు జీవనాధారం ఎలా.?



డివైడర్‌పై ఉన్న రేకులు తొలగిస్తున్న చిరువ్యాపారులు

టంగుటూరు: టంగుటూరులో రోడ్ల పక్కన, డివైడర్ల మధ్య, మార్జిన్‌లలోచిన్న చిన్న బంకుల్లో వ్యాపారులు చేసుకుంటూ వందల మంది ఏళ్ల తరబడి జీవనం సాగిస్తున్నారు. అయితే రోడ్డు వెడల్పు, సుందరీకరణ పేరుతో బుధవారం వాటిని తొలగిస్తున్నారు. పంచాయతీ అధికారులు ప్రత్యామ్నాయంగా స్థలం చూయించామని చెబుతున్నా..పట్టణానికి దూరంగా అక్కడ వ్యాపారం ఉండదని వారంతా వాపోతున్నారు. అందరికీ సమ్మతమైన స్థలాన్ని కేటాయించాలని చిరు వ్యాపారులు కోరుతున్నారు.